

# మానసమయూరి

– కస్తూరి మురళీకృష్ణ



*(గత సంచిక తరువాయి)*

**శిల్ప 'హలో' అన్న** తరువాత ఏం మాట్లాడాలో అర్థం కాలేదు శరత్‌కు. తాను శిల్పకు ఫోను చేయటం ఎంత మూర్ఖత్వమో అర్థమయింది.

ఎవరో ఏదో అనగానే తాను రియాక్టవటం ఏమిటి? వెంటనే శిల్పకు ఫోను చేయటం ఏమిటి?

దీన్లో శిల్ప ఏం చేస్తుంది?

ఎందుకని అలా రియాక్టయ్యాడు?

అంటే తన మనసులో ఏదో మూల శిల్పను కలవటం 'తప్పు' అన్న భావన తనకు వుందా?

శిల్ప పట్ల తన మనసులో తాను బహిరంగంగా ప్రకటించని భావనలు వున్నాయా? ఇప్పుడు మాధవి మాటలవల్ల వాటి స్వరూపం బయట పడుతుందన్న భయం తన విచక్షణను హరించిందా?

'హలో' అంది శిల్ప మరోసారి.

'హలో శిల్పా!' అన్నాడు శరత్. అతడి గొంతు బొంగురుగా ధ్వనించింది.

'ఏమీ నా భాగ్యము.. మీరే ఫోను చేశారు?' అంది నాటకీయంగా.

'ఏమీలేదు.... మాట్లాడాలనిపించింది' అన్నాడు శరత్

'చెప్పండి.. ఫోనులో చెప్తారా? బయట కలుద్దామా?' అంది శిల్ప.

శరత్ గొంతు పెగలలేదు. అతడి మెదడు మొద్దు బారిపోయింది.

అంతవరకూ తాను శిల్పను బయట కలుస్తున్నాడని వేరేవారికి తెలిసిందన్న ఆలోచన అతడిని కలవర పరిచింది. కానీ ఇప్పుడు శిల్ప 'బయట కలుద్దామా?' అనటంతో ఒక్కసారిగా కలవరం అణగిపోయింది. ఉద్విగ్నత ఉత్తేజమై ఉరకలు వేసింది. ఆమెను కలవాలనిపించింది. మిగతా ఆలోచనలు, భయాలు అదృశ్యమై పోయాయి. ఆవిరైపోయాయి.

'బయట కలుద్దాం' అన్నాడు.

'ఎక్కడ?' వెంటనే అడిగింది.

అతడికి ఏం చెప్పాలో తెలియలేదు. 'మనం కలుస్తున్నట్లు ఎవరి కంటా పడనిచోటు' అన్నాడు అనాలోచితంగా.

నవ్వింది శిల్ప 'వహీ జహ కోయీ ఆతా జాతా నహీ' అంది.

'నువ్వే ఆలోచించు. నువ్వే నిర్ణయించు. నా మెదడు పనిచేయటంలేదు' అన్నాడు శరత్.

నవ్వింది శిల్ప 'ఇన్నాళ్ళూ మిమ్మల్ని కలవాలని నేనే తపిస్తున్నానని అనుకున్నాను.

'ఖుద్ ఢూండ్ రహీ హై షమ్మ జోసే క్యా బాత్ హై.. ఉస్ పర్వానే కీ' అని పాడుకుంటున్నాను.

బాగుంది మీరు పిలవటం. థాంక్యూ నేను మెసేజ్ ఇస్తాను.' అంది శిల్ప.

ఫోను పెట్టేసిన శరత్‌కు శిల్ప ఇచ్చిన రిఫరెన్స్ తెలుసు.

'ఆంఖోంసె జో ఉత్‌రీ హై దిల్మే, తస్వీర్ హై ఎక్ అన్‌జానే కీ' అనే పాట పల్లవిలోని పాదం ఆమె కోట్ చేసింది.

కళ్ళల్లోంచి హృదయంలోకి ఒక అపరిచితుడు చిత్రం జారి స్థిరపడిదన్న అర్థం వస్తుంది. అంటే ఆమె కళ్ళు ఓ అపరిచితుడిని చూశాయి. ఆ అపరిచితుడి స్వరూపం ఆమె హృదయంలో స్థిరపడింది. అప్పటి నుంచీ ఆమె అతడి కోసం వెతుకుతోంది.

సాధారణంగా ఉర్దూ, పార్సీ కవితలలో స్త్రీని దీపంతోనూ, అంటే షమ్మ, పురుషుడిని దీపం పురుగు 'పర్వానా'తోనూ పోలుస్తారు.

దీపం చుట్టూ తిరుగుతుంది దీపం పురుగు. దీపంలో పడి మాడిపోతానని తెలిసి కూడా దీపంలో పడుతుంది.

దీపం అక్కడే వుంటుంది. దీపాన్ని వెతుకుతూ వెళ్ళి దాన్లో పడి పురుగు మాడిపోతుంది.

స్త్రీ పురుష సంబంధంలో పురుషుడు చొరవతీసుకుంటాడు. స్త్రీని ఆకర్షించాలని ప్రయత్నిస్తాడు. ఆమె వెంట పడతాడు. సాధారణంగా స్త్రీ పురుషుడి వెంట పడి, అతడిని ఆకర్షించాలని ప్రయత్నించి 'నన్ను ప్రేమించమ'ని ప్రాధేయపడదు. అది సినిమాల్లో పురుషులు కల్పించిన పురుష ఫాంటసీ.

సాధారణంగా పర్వానా, షమ్మను వెతుకుతూ వెళ్తుంది. దీపం, దీపం పురుగును వెతుకుతూ పోదు.

కానీ, ఈ సందర్భంలో దీపమే దీపం పురుగును వెతుకుతోంది. అంటే - ఎంత గొప్పదికదా ఆ దీపం పురుగు.

'ఖుద్ ఢూండ్ రహీ హై షమ్మ జోసే క్యా బాత్ హై.. ఉస్ పర్వానే కీ'

ఒక్కసారిగా శరత్ హృదయం ఉప్పొంగింది.

క్షణం క్రితం ఉద్విగ్నత, ఆందోళనలు అన్నీ అదృశ్యమయ్యాయి.

శిల్ప తనను అభిమానిస్తోంది. తనను కలవాలని కోరుకుంటోంది. కానీ తాను చొరవ తీసుకోకపోవటం వల్ల తనే అడుగు ముందుకేసింది.

కానీ ఎందుకోసం? దీని ఫలితం ఏమిటి? పర్యవసానం ఏమిటి?

ఒక్కసారిగా కృంగినట్టయింది శరత్ హృదయం.

అంతలోనే ఇంత వయసు వచ్చినా యవ్వనం నాటి ప్రేమ భావనలు తనలో నశించలేదనన్ భావన బలంగా అతడిని తాకింది.

మనిషి వయసు పరంగా ఎంతగా ఎదిగినా అతడు పసివాడేనా?

తనకు వివాహమయింది. పిల్లలు ఎదుగుతున్నారు. వారు ప్రేమలో పడే వయసులో వున్నారు.

ఇలాంటి పరిస్థితిలో తాను ఇంకా ప్రేమకోసం తపిస్తున్నాడా? ఓ యువతి కలుద్దాం అని అనగానే ఏవేవో ఊహించేసుకుని కలలుగనే యవ్వనపు భ్రమలలోనే వున్నాడా?

ఆ భావనలు తనలో నిద్రాణంగా వున్నాయా? సజీవంగానే వున్నాయా?

శరత్‌కు తిరిగి సీటుకు వెళ్ళాలనిపించలేదు. ఒంటరిగా వుండి తనలో చెలరేగుతున్న పలు విభిన్నమైన భావాలను అర్థం చేసుకోవాలని వుంది. సంచలనాల స్వరూపాన్ని అవగాహన చేసుకోవాలని వుంది.

బయటకు నడిచాడు. దారిలో కనపడినవారు విష్ చేస్తూంటే యాంత్రికంగా 'విష్' చేస్తూ నడిచాడు.

సాధారణంగా ప్రతివారికీ కలలుంటాయి. ఆ కలలకు ప్రాతిపదిక ప్రేమ భావన. ఇంటి వాతావరణంలో తల్లిదండ్రులు, బంధువులు, స్నేహితులనుంచి లభించే ఆదరణ, ప్రేమలు వ్యక్తికి ఆత్మవిశ్వాసాన్నిస్తాయి. సంతృప్తినిస్తాయి. కానీ అతడిలో ప్రాకృతికంగా కలిగే ప్రేమ భావనను అవి తాకను కూడా లేవు.

అది ఒక యువతి మాత్రమే సంతృప్తి పరచగలిగే భావన. కానీ ఆ భావన శాశ్వతమా?

తన జీవితంలో స్రవంతి అడుగుపెటిన తరువాత ప్రేమ రాహిత్య భావన ఆగిపోయింది.

'ఈమె తన స్త్రీ, ఈమె తన ప్రపంచం' అన్న భావన ఆధిక్యం సంపాదించింది. ఊహలు, కలలు, కోరికలు, అన్నీ అణగి, రూపాంతరం చెంది స్రవంతి కేంద్రంగా ఎదిగాయి.

కలలు కలలే. జీవితం జీవితమే.

ఏ కలా నిజం కాదు. ఏ నిజం కలకాదు.

కలను కాలానికి వదిలి నిజంతో రాజీపడి నిజాన్నే కలగనటాన్ని మించిన ఆనందం మరొకటి లేదు. తాను అదే చేస్తూ వచ్చాడు. తాను సంతృప్తిగా, ప్రశాంతంగా వున్నాడని అనుకున్నాడు.. శిల్ప కలిసేవరకూ.

శిల్ప తనలో నిద్రాణమై వున్న ప్రేమ భావనలను జాగృతం చేసిందా?

అణగి వున్న తీరని కోరికలకు వూపిరి పోసి రెక్కలనిస్తోందా?

ఏమిటీ అణగి వున్న ప్రేమ భావన?

శరత్ మనస్సు అల్లకల్లోలంగా వుంది.

ఇది ప్రేమ అనటానికి వీలులేదు. ఇది ఆకర్షణ. తన మనసు మారుమూలల్లో అణగి వున్న రొమాంటిక్ భావనలు జాగృతమై తనకు కలిగిస్తున్న భ్రమ ఇది.

ఇదేనా ఇంద్రియాలు కలిగించే మోహావేశ పరవశం?

భారతీయ తత్వం ఇంద్రియాలు అందించే జ్ఞానం అసంపూర్ణం అంటుంది. ఇంద్రియాలు మనిషికి భ్రమ కలిగిస్తాయని అంటుంది. ఆ భ్రమలో పడ్డ వ్యక్తి తన బుద్ధిని విచక్షణను మంచి ఇంద్రియాలు చెప్పినట్టు నడుస్తాడు, నశిస్తాడు అంటుంది వేదాంతం.

'ఆంఖోంసె జో ఉత్‌రీ హై దిల్మే...' ఇప్పుడు కొత్తకోణంలో అర్ధమౌతోంది. కళ్ళనుంచి హృదయంలో చేరిన రూపం కళ్ళద్వారా హృదయంలోకి చేరింది' పంచేంద్రియాలలో కన్ను ఒకటి.. కళ్ళు మోసం చేస్తాయి. ఇంద్రియాలు ప్రలోభపెడతాయి.

తనకు శిల్ప గురించి ఏం తెలుసు?

శిల్ప రూపం చూశాడు. గానం విన్నాడు. ఆమె పట్ల ఆకర్షితుడయ్యాడు. ఆమె సానుకూలంగా స్పందించటంతో తనలో రొమాంటిక్ భావనలు జాగృతం అయ్యాయి.

ఇంతకీ తాను శిల్ప నుంచి ఏమాశిస్తున్నాడు?

శిల్పతో పరిచయంలో ఏం కోరుతున్నాడు?

ఏం సాధించాలనుకుంటున్నాడు?

తనకే తెలియదు. తరచి చూసుకుంటే కళ్ళు.. మనిషికి దారి చూపించి విషయ పరిజ్ఞానం కలిగించే కళ్ళు తనని గుడ్డివాడిని చేశాయి. తనని దారి తప్పించాయి. తనని మోసం చేశాయి.

ఎంతో ఆవేశంగా అనిపించింది శరత్‌కు.

తాను... ఎన్నో పుస్తకాలు చదివాడు. విజ్ఞానవంతులలో ఒకడిగా తనని తాను భావించుకుంటాడు. ఇతరుల కన్నా భిన్నం అనుకుంటాడు.

జీవితంలో అన్నీ అనుభవించాడు. ఒక స్థాయికి చేరుకున్నాడు. మంచి, చెడు గ్రహించగలవాడు తాను ఎలా ప్రలోభంలో పడ్డాడు?

ఇంత ఎదిగినా ఓ యువతి నవ్వుతూ పలకరించగానే, అప్పుడే యవ్వనంలో అడుగుపెట్టిన కుర్రాడిలా కలలు కనటం ప్రారంభించాడు.

శిల్పనుంచి మెసేజ్ వచ్చింది.

'క్రోకిట్ బేకరీలో కలుద్దాం'

వెంటనే సమాధానం ఇచ్చాడు. 'సారీ.. అనుకోని అవాంతరం వచ్చింది. నేను కలవలేను.'

మెసేజ్ ఇచ్చిన తరువాత బాధ అనిపించింది.

'పొరపాటు చేశానేమో?' అనిపించింది.

కానీ అన్ని ఆలోచనలను అణచివేశాడు.

శిల్ప ఇంకా చిన్నపిల్ల. ఆమెలో నిరాశలో వుంది. ఒంటరిగా వుంది.

కానీ తాను అలాకాదు. వయసు పరిణతి కలవాడు. విచక్షనను వుపయోగించాలి. ఇక్కడితో ఈ సంబంధాన్ని ముగించాలి.

ఈ ఆలోచన రావటంతోటే మనసుని ఎవరో మెలిపెట్టినట్టయింది.

శిల్ప తనకేమీ కాదు. ఆమెతో తనకు ఎలాంటి అనుబంధం ఏర్పడలేదు. ఆమెకూ తనకూ నడుమ వున్న అనుబంధ స్వరూపం ఇంకా స్పష్టం కాలేదు.

అయినా, ఇక ఆమెని కలవకూడదు అనుకుంటే ఎలాగో అనిపించింది. ఇక ఆమెని కలవడు, ఆమెతో మాట్లాడడు, ఆమె ఎదురుగా కూర్చుని ఆమెతో పలు విషయాలు చర్చించాడు. ఆమె కళ్ళల్లోకి చూడలేడు, ఆమె అందమైన రూపాన్ని చూడలేడు అన్న భావన అలవికాని ఆవేదనను కలిగిస్తోంది.

తల విదిలించాడు. ఈ బంధానికి ఇంతటితో స్వస్తి చెప్పటం మంచిది. ఇది తన జీవితాన్ని తనపై ఆధారపడిన వారి జీవితాలను అల్లకల్లోలం చేసేలోగా ఇక్కడితో అంతం చేస్తే మంచిదన్న నిర్ణయానికి వచ్చాడు శరత్. తల విదిలించాడు. గబగబా నడవటం ప్రారంభించాడు.

జిస్ దిల్‌మె బసాధాప్యార్ తెరా, ఉస్ దిల్ కా కభినా తోడ్ దియా

బర్‌నామ్‌న హోనే దేంగె తుఝె, తెర నామ్ హిలే నా ఛోడ్ దియా.

నీ ప్రేమతో నిండిన హృదయాన్ని పగులగొట్టాను. నీ పేరు తలిస్తే నీకు అపకీర్తి వస్తుందేమోనని నీ పేరు తలవటం కూడా మానేశాను.

ముకేశ్ స్వరంలో నిండిన విషాద భావం ఎదలోలోతుల్లోని ఆవేదనను వుబికి వుబికి వెలికి తెచ్చి ప్రక్షాళన చేస్తూంటే, ఆవేదనలో అణగి వున్న అంతులేని ఆనంద స్వరూపం అర్థమవుతోంది శరత్‌కు.

ప్రజలు విషాద గీతాలను ఎందుకు అంతగా ఇష్టపడతారో అర్థమౌతోంది. ప్రతి వ్యక్తితో తాను మోసపోతున్నాడు, తనకు అన్యాయం జరుగుతోంది అన్న భావన అంతర్గతంగా వుంటుంది. ముఖ్యంగా ప్రేమ విషయంలో వ్యక్తి విషాదానికే ప్రాధాన్యం ఇస్తాడు. అందుకే ఫలించిన ప్రేమ గాథలకన్నా విషాదగాథలకే ఆదరణ ఎక్కువ. ఆ విషాదం పొందాలన్న భావనను సంతృప్తి పరచే ఇలాంటి

గీతాలు, వ్యక్తుల తీరని కోరికను సంతృప్తి పరుస్తాయి. విషాదంలోనూ ఆనందాన్ని కలిగిస్తాయి. అందుకే ప్రేమ స్వరూప తెలియని వారు, ప్రేమ భావన దరిదాపులకు కూడా రానివారు కూడా విషాద గీతాలు, విఫల ప్రేమగీతాలు వింటూ స్పందిస్తారు. పరవశిస్తారు. పాట వింటూ తన మనసులోని ఆవేదనను, విషాదాన్ని ప్రక్షాళన చేసుకుంటున్నాడు శరత్.

సంగీతం ఎంతో గొప్పది. సాహిత్యం ఇంకా గొప్పది. సంగీతం, సాహిత్యం కలగలిస్తే ఇక వ్యక్తి మనస్సు రెక్కలు కట్టుకుని అనంతాంబరంలో విహరిస్తుంది. వీటికి సుమధుర స్వరం తోడయితే ఇక వ్యక్తి హృదయ లోలోపల్లోనే అనంతాంబరపు నీలినీడల అద్భుత సౌందర్యం సాక్షాత్కారమవుతుంది. అలౌకికానందానుభూతికి నాందీ ప్రస్తావన జరుగుతుంది.

'ఎపుడూ పాటలు వింటూ ఏవో లోకాల్లో తేలటమేనా, కాస్త భూమి మీదకు వచ్చి మాములు ప్రపంచపు వ్యవహారాలు పట్టించుకునేదేమైనా వుందా?' ప్రశాంతి మాటలతో ఒక్కసారిగా ఈలోకానికి వచ్చి పడ్డాడు శరత్.

'ఏమైంది మామూలు ప్రపంచపు వ్యవహారాలకు?' అడిగాడు.

'స్రవంతి ఇంకా రాలేదు. ఫోన్ చేస్తూంటే ఎత్తటంలేదు.' ఆందోళనగా చెప్పింది.

టైమ్ చూశాడు. పది దాటుతోంది.

'ఫ్రెండింటికి చదువుకోటానికి వెళ్ళినట్టుంది' అన్నాడు.

'అదేదో చూడండి. ఆడపిల్ల ఇలా రాత్రిళ్ళు బయట తిరగటం మంచిదికాదని గట్టిగా చెప్పండి. పిల్లలకు తండ్రి భయం వుండాలి. తల్లి ఎంత అరిచినా వాళ్ళు తేలికగా తీసుకుంటారు.'

నవ్వుతూ ఏదో అనబోయాడు. ప్రశాంతి అడ్డుపడింది.

'మీ తెలివితేటల మాటలు కట్టిపెట్టండి. ముందు అమ్మాయిని ఎక్కడుందో తెలుసుకోండి' అంది.

'నువ్వు కంగారు పడకు. అది చిన్నపిల్లకాదు. మంచి చెడు తెలుసు.' దాని గురించి నువ్వెందుకు కంగారు పడతావు? ఇల్లు తప్ప ఎక్కడికీ పోదుకదా!'

కోపంగా చూసింది శరత్ వైపు 'దానికి మంచీ చెడు తెలుసు. దాని స్నేహితులందరికీ మంచీ చెడూ తెలియాలని లేదు. ప్రపంచంలో ప్రతి ఒక్కరికీ మంచి చెడు తెలియాలని లేదు. ఎంత వయసు వచ్చినా మంచీ చెడూ తెలియక దెబ్బతినేవారు ఎందరో వున్నారు. ఇంకా విచక్షణ లేని యవ్వనంలో వుంది. దానికి మంచీ చెడు తెలిసినా దాని వయసుకు మంచీ చెడు తెలియదు. దాని యవ్వనానికి మంచీ చెడు తెలియదు. అంతవరకూ మనం జాగ్రత్తలు తీసుకోవాలి.' అంది ప్రశాంతి.

ఆమె మాటలు కొరడా దెబ్బల్లా తగిలాయి శరత్ మనసుకు.

'మంచి చెడు అసలు మనిషికి ఎపుడయినా తెలుస్తాయా?' అనుకున్నాడు బయటకు అడుగుపెడుతూ.

సందు మలుపు తిరుగుతూ ఆగిపోయాడు.

సందు చివరలో హోండా మోటరు ఆగి వుంది. దానిపై ఇద్దరు యువకులు కూర్చుని వున్నారు. వారి ఎదురుగా ఇద్దరు యువతులు నుంచుని మాట్లాడుతున్నారు చూడగానే వాళ్ళు కాలేజీ విద్యార్థినీ విద్యార్థులని తెలుస్తోంది.

వాళ్ళు లోకం మరచి మాట్లాడుకుంటున్నారు. వచ్చిపోయే వాళ్ళ చూపులను పట్టించుకోకుండా.

వారిలో స్రవంతిని సులభంగా గుర్తుపట్టాడు శరత్.

అతడి రక్తం మొత్తం పొంగి చేతుల్లోకి వచ్చింది. ఆవేశం ఉప్పెన అయి ఎగసింది.

ఆ వైపు వేగంగా అడుగులు వేయబోయి ఆగిపోయాడు. తానూ నీడల్లో ఒదిగి వాళ్ళని గమనించసాగాడు.

*(కొనసాగింపు వచ్చే సంచికలో)*

Post your comments